ప్రజాశక్తి
గురువారం 3 అక్టోబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు

నూతన మద్యం పాలసీని రద్దు చేయాలి

ప్రజాశక్తి హుకుంపేట: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీని వెంటనే రద్దు చేయాలని ఆదివాసి గిరిజన మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.కౌసల్య, ఎస్ హైమావతి డిమాండ్ చేశారు. బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం మద్యం షాపులను ప్రోత్సహించడం వల్ల మద్యం మత్తులో మహిళలపై వేధింపులు, చిత్రహింసలు, అత్యాచారాలు చోటుచేసుకుంటున్నాయన్నారు.. ప్రభుత్వం పునరాలోచించి నూతన మద్యం పాలసీని రద్దుచేసి మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు.కార్యక్రమంలో నీలమ్మ, మహిళలు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీ గిరిజన మహిళలు

గుంటసీమలో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని మారుమూల గుంటసీమలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు డిమాండ్ చేశారు. బుధవారం రంగిలిసింగి పంచాయితీ లింగగూడ గ్రామంలో సిపిఎం మహాసభ నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. తూటాంగి, లైగండ. గుంటసిమ, రంగిలిసింగి, గుంటగన్నెల పంచాయితీలకు చెందిన దాదాపు 55 మారుమూల గ్రామాలలో సుమారు 15వేలు మంది జనాభా ఉన్నారన్నారు. వారంతా వ్యాధులకు గురైనప్పుడు సుమారు 15 నుంచి 20 కిల్లోమీటర్ల దూరంలో ఉన్న డుంబ్రిగుడ, అరకు ఏరియా ఆసుపత్రులకు వైద్య సేవలకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారనిన్నారు. ఈ నేపథ్యంలో ఈ నాలుగు పంచాయతీలకు కేంద్రంగా ఉన్న గుంటసీమలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకుడు టి సూర్యనారాయణ, పి డొంబు, పి.మోహన్ దాస్ ,పి జైరాం, పి లోకిరం, పి భగవాన్ ,పి ఆనందరావు, కె.రాము, వి సీతారాం, వి తుమ్‌నాథ్ పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల ఊబిలో 'డాలిగుమ్మడి'

● జ్వరాలు, మరణాలు భయంతో తాంత్రిక పూజలు ● గ్రామంలోకి ఎవరూ రాకుండా రహదారి దిగ్బంధం

ప్రజాశక్తి- హుకుంపేట: మూఢ నమ్మకాలను పారదోలాలని, శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించి, ముందుకు సాగాలని ప్రభుత్వం, పలు సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నప్పటికీ నేటికీ కొన్ని గ్రామాల్లో మూఢనమ్మకాలు రాజ్యమేలుతూనే ఉన్నాయి. జ్వరాలు ప్రబలినపుడు వైద్యసేవలు కంటే భూత వైద్యులు పూజలు, మాంత్రికులను ఆశ్రయించడం వంటివి నేటికీ కొనసాగుతున్నాయి. ఈ కోవలోనే హుకుంపేట మండలం, హుకుంపేట పంచాయతీకి చెందిన డాలిగుమ్మడి గ్రామస్తులు మరింత మూఢాచారంగా ఏకంగా రెండురోజుల పాటు తమ గ్రామంలోని ఎవరినీ రానీయకుండా గ్రామానికి ఉన్న రోడ్లన్నీ మూసేసి నాటువైద్యులు, మంత్రగాళ్లతో తమ గ్రామంలో క్షుద్ర, తాంత్రిక పూజలు చేసిన ఘనంగా స్థానికంగా సంచలనం, కలకలం రేపింది. వివరాలివి.

ఏటా సీజనల్‌గా ప్రబలిన వ్యాధులు, జ్వర మరణాలతో భీతిల్లిపోయిన డాలిగుమ్మడి గ్రామస్తులు, వాటన్నింటికీ పరిహారం కోసం తాంత్రిక పూజలకు సిద్ధమయ్యారు. వైద్యసేవలను ఆశ్రయించినా, జ్వరమరణాలు కొనసాగుతున్నాయనే భయంతో గ్రామస్తులంతా నాటు వైద్యులు, మాంత్రికులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు గ్రామంలో ఏవేవో పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా రెండురోజులపాటు గ్రామంలోకి ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు, చివరకు బంధుమిత్రులను సైతం రానీయకుండా ఏకంగా

గ్రామంలోకి ఎవరూ రాకుండా రహదారికి అడ్డంగా వేసిన కర్రల గేటు

గ్రామం శివారులో నిర్వహించిన పూజలు

గ్రామానికి వెళ్లే రహదారిని దిగ్బంధించారు. మంత్రగాళ్లలో గ్రామంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఇలా చేయడం వల్ల జ్వరమరణాలు ఉండవని వీరంతా మూఢంగా విశ్వసిస్తున్నారు. కొన్నాళ్లగా ఈ వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. ఇంత జరుగుతున్నా మూఢనమ్మకాల్లో మగ్గిపోతున్న ఆ గ్రామస్తుల్లో చైతన్యం కలిగించేందుకు అటు ప్రభుత్వం తరపున అధికారులుగానీ, దీనిపైనే ప్రజలను చైతన్యపరిచే సంస్థలుగానీ అటువైపు రాలేదు. గిరిజనుల్లో అవగాహనా రాహిత్యం, చైతన్యలేమితోనే ఇదంతా జరుగుతోందని అంటున్నా, మూఢనమ్మకాల ఊబిలోంచి వారిని బయట పెట్టేందుకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న గిరిజన లబ్ధిదారులు

నాలుగు గ్రామాల లబ్ధిదారులకు ఒక దగ్గరే పింఛన్ల పంపిణీ

- గ్రామాలకు వెళ్లి ఇంటింటికీ ఇవ్వాలని గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి -కొయ్యూరు

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నా మండలంలోని డౌనూరు పంచాయతీలో నాలుగు గ్రామాలకు ఒకే దగ్గర పింఛన్లు పంపిణీ చేస్తున్నారని బాధిత లబ్ధిదారులు, గిరిజన సంఘం నాయకులు తెలిపారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ డౌనూరు పంచాయతీ పరిధి తులబడ, నిమ్మలపాలెం, గొప్పువీధి, జోడుమామిడి గ్రామాల పింఛను లబ్ధిదారులకు నాలుగు నెలల నుంచి తులబడగెడ్డ గ్రామంలో పింఛన్లు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. నిమ్మలపాలెం, గొప్పువీధి, జోడుమామిడి గ్రామాలకు తారు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ అధికారులు ఆ గ్రామాలకు వెళ్లి ఇంటింటికీ పెన్షన్ పంపిణీ చేయడం లేదని పేర్కొన్నారు. నాలుగు గ్రామాల లబ్ధిదారులకు ఒకే చోట పెన్షన్ పంపిణీ చేయడం వలన ఎండ, వానలో నిలబడి ఉండి, ఆకలితో సాయంత్రం ఏడు, ఎనిమిది గంటల వరకు నిరీక్షించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో తమ గ్రామాలకు వెళ్లడానికి వాహనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది ప్రతి గ్రామంలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నాయకులు జి.సానా, టి. ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

విలేకర్ల రేకుల షెడ్లు తొలగింపు దుర్మార్గం

ప్రజాశక్తి - హుకుంపేట: గిరిజన విలేకరులకు కేటాయించిన స్థలంలో నిర్మించిన రేకులు షెడ్లను తొలగించిన లగిసపల్లి టిడిపి సర్పంచ్ లక్కె పార్వతమ్మ, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని హుకుంపేట మండల విలేకర్లు కోరారు సర్పంచ్ తీరును నిరసిస్తూ మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. పాడేరు పల్లి కస్తూర్బా పాఠశాల వద్ద అక్రిడిటేషన్ కలిగిన గిరిజన విలేకరులకు మూడు సెంట్లు చొప్పున ఇంటిస్థలాన్ని 2016లో కేటాయించగా, అందులో రేకుల షెడ్‌లను నిర్మించుకోగా, స్థానిక సర్పంచ్ దౌర్జన్యంగా వాటిని తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకర్ల నిరసనకు ఆదివాసీ గిరిజన మహిళ సంఘ అధ్యక్ష కార్యదర్శులు టి. కౌసల్య, ఎస్ హైమావతి సంఘీభావం తెలిపారు. విలేకర్ల ఇళ్లస్థలాలతో రాజకీయాలు చేయడం సరికాదన్నారు.దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కిముడు గణేష్, నాగరాజు, అధ్యక్షులు కే ఆనంద్, కోశాధికారి పండు, శ్రీను, భాస్కర్, చిరంజీవి, అఖిల్ పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న విలేకర్లు

విలేకర్లకు న్యాయం చేయాలి

పెదబయలు : పాడేరు సమీపంలో ఎనిమిదేళ్ల క్రిత పదిమంది విలేకర్లుకు కేటాయించిన మూడు సెంట్లు ఇంటిస్థలంలో నిర్మించిన రేకుల షెడ్లును లగిసపల్లి సర్పంచ్ ఆధ్వర్యంలో ఆకతాయిలు ధ్వంసం చేయడం దుర్మార్గమని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లాపూర్వ అధ్యక్షుడు బొండా సన్నిబాబు అన్నారు. విలేకర్లకు న్యాయం చేయాలని కోరారు. స్థానిక ప్రెస్ క్లబ్ తరుపున మహాత్ముని.విగ్రహానికి వినతి ఇచ్చారు. పాత్రికేయులకు గిరిజన సంఘం అండగా ఉంటుందన్నారు.

సంఘీభావం తెలుపుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత సన్నిబాబు

ఊరును బాగుచేసుకోవడం అందరి బాధ్యత

ప్రజాశక్తి -పాడేరు : మన ఊరు బాగు చేసుకోవడానికి మనమే ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని వంజంగి గ్రామపంచాయతీ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశంలో 750 గ్రామాలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తుండగా, అల్లూరి జిల్లాలో ఆరు గ్రామాలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నా మన్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నప్పటికీ ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని గుర్తించి మరింత అభివృద్ధి చేయడానికి వీలుగా ఈ ప్రత్యేక గ్రామసభలను నిర్వహిస్తున్నామన్నారు.గ్రామాల మధ్య అందులోని ప్రజల మధ్య వ్యత్యాసాలు న్నాయని, వాటిని గుర్తించి పరిష్కరించే దిశగా ఈ ప్రత్యేక గ్రామసభలు ఉపకరిస్తాయ న్నారు. గ్రామాల స్వచ్ఛత, పరిశుభ్రతకు శ్రమదానం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి శుక్రవారం రెండు గంటలు ఇల్లు, పరిసరాలను శ్రమదానంతో శుభ్రం చేయాలని సూచించారు. ఈనెల నుంచి జనవరి వరకు వంజంగిలో పర్యాటకుల సందడి ఎక్కువగా ఉంటుందని, పర్యావరణానికి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా పర్యాటకులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామంలో గిరిజనుల కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలపై పర్యాటకులకు అవగాహన కల్పించడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచగలమన్నారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా వృద్ధ మహిళలతో మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతిప్రజ్వళన చేసి నివాళులర్పించారు. బిగ్‌స్క్రీన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాలను వినిపించారు. కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు. 70ఏళ్లు నిండిన 16మంది వృద్ధులను సత్కరించారు. వారి అభిప్రాయాలు, అనుభవాలను తెలుసు కున్నారు. 20 మంది క్లాఫ్ మిత్రలకు సత్కారం చేశారు. గ్రామంలో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో డిపిఒ టి కొండలరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్ఎస్‌వి కుమార్, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ తరపున ఆశీష్ యాదవ్, ఎన్ఐఆర్‌డి ప్రతినిధి నాగరాజు, పిరమిడ్ సంస్థ తరపున నారాయణ రెడ్డి, రేష్మ, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, ఎంపిటిసి పాత్రుడు, సర్పంచ్ బొంజుబాబు పాల్గొన్నారు

గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

జిల్లాలో ఆరు గ్రామాలలో ప్రత్యేక గ్రామసభలు

పాడేరు మండలం వనజంగిలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో, గొందెలిలో సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ ఆధ్వర్యంలో, గుత్తులపుట్టు గ్రామంలో డిఆర్‌డిఎ పీడీ వి.మురళి ఆధ్వర్యంలో బడిమెలలో ఐసిడిఎస్ పీడీ ఎన్.సూర్య లక్ష్మి ఆధ్వర్యంలో అలాగే హుకుంపేట మండలం జికె.మండలో జెసి డాక్టర్ అభిషేక్ గౌడ్ ఆధ్వర్యంలో, మొట్టుజోరులో డ్వామా పిడి శివయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభలు జరిగాయి.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతన మద్యం విధానం 2024-26 ప్రకటించిన నేపథ్యంలో రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మద్యం దుకాణాల నిమిత్తం అక్టోబర్ 1 నుండి 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రంపచోడవరం ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సిఐ ఎన్.శ్రీధర్ బుధవారం ఒక ప్రటటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేవారు ఆన్లైన్ పద్ధతిలో హెచ్‌పిఎఫ్ఎస్ ప్రాజెక్ట్ డాట్ కం నందు ఎంటర్ అయ్యి మీ యొక్క మొబైల్ నెంబర్ ద్వారా ఎన్రోల్మెంట్ చేసుకోవాలని సూచించారు. సదరు మొబైల్ నెంబర్ యూజర్ ఐడిగా మారుతుందని, పాస్వర్డ్ మీరే స్వయంగా మీకు నచ్చినట్లు పెట్టుకొని సంబంధిత గజట్ నెంబర్ గల దుకాణంకు అప్లికేషన్ వివరాలు గురించి అప్లికేషన్ ఫీజు రూ.2 లక్షలు బ్యాంక్ చలానా నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డ్, డిడి రూపంలో చెల్లించాలని కోరారు. ఒకవేళ డిడి తీసేవారు ఇన్ ఫేవర్ ఆఫ్ డిస్ట్రిక్ట్ ప్రొఫెషనల్ ఎక్సైజ్ ఆఫీసర్ పాడేరు అల్లూరి సీతారామరాజు జిల్లా పేరు మీదగా తీయాలని, షెడ్యూల్ ట్రైబల్ ఏరియాలో దరఖాస్తు చేసుకునేవారు కుల ధ్రువీకరణ పత్రం నివాస ధ్రువీకరణ పత్రం ఏదైనా గుర్తింపు కార్డు రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలో అప్లికేషన్ ఇవ్వాలని కోరారు. దరఖాస్తుదారులందరూ ఈ నెల 11న ఉదయం 8 గంటలకు జరుగు లాటరీ ప్రక్రియలో పాల్గొనుటకు విఆర్ ఫంక్షన్ హాల్ ఎస్పీ ఆఫీస్ దగ్గర పాడేరు,. విశాఖపట్నం రోడ్డు వద్ద ఎంట్రీ పాసులతో హాజరు కావాలని కోరారు. ఏదైనా సమాచారం కావాల్సిన ఎడల రంపచోడవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వద్దకు సంప్రదించాలని సూచించారు.

హెచ్‌పి గ్యాస్ బినామీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ

ప్రజాశక్తి -మారేడుమిల్లి

మారేడుమిల్లిలో బినామీ పేరుతో హెచ్‌బి గ్యాస్ ఏజెన్సీ నిర్వహిస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. ఈ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గృహ వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు సక్రమంగా ఇవ్వకుండా, దానిపై ప్రశ్నించే గిరిజనులపై దురుసుగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. బుధవారం ఆమె బాధితులతో కలిసి స్థానిక గ్యాస్ ఏజెన్సీ వద్ద విలేకర్లతో మాట్లాడారు. మారేడుమిల్లి మండలంలో హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ నిర్వహణ మొత్తం బినామీ పేరుతో గిరిజనేతరులు నిర్వహిస్తున్నారని తెలిపారు. బుధవారం ఉదయం గ్యాస్ కోసం తనతో పాటు కొంత మంది గిరిజనులు వెళ్లగా నిర్వాహకులు లేదని చెప్పారని, ఎందుకు లేదని ప్రశ్నించగా, మేనేజర్ సాయి దురుసుగా గిరిజన మహిళలు అనే గౌరవం కూడా లేకుండా ఎవడితో చెప్పుకుంటావో చెప్పుకోమంటూ, తనను ఎవడు ఏమీ చేయలేడంటూ మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. గృహ వినియోగదారులకు ఇవ్వాల్సిన గ్యాస్ బండలను నిర్వాహకులు హోటళ్లకు అమ్ముకుంటూ గ్యాస్ కోసం వచ్చిన గిరిజనులను ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ సాయిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలనీ వాణిశ్రీ డిమాండ్ చేశారు. గిరిజనుల పట్ల ఎవరు దురుసుగా ప్రవర్తించిన సహించేది లేదని ఆమె హెచ్చరించారు. సబ్సిడీ గ్యాస్ ఎప్పటి నుంచి ఎప్పటి వరకు ఇచ్చారో ఎంతమంది గిరిజనులకు సబ్సిడీ ఇచ్చారో ఉన్నతాధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ఆమె కోరారు. ఈ విషయంపై త్వరలోనే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

బాధిత గ్యాస్ వినియోగదారులతో మట్ల వాణిశ్రీ

ర్యాలీ నిర్వహిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

అటవీ సంరక్షణ మన అందరి బాధ్యత అని రాజవొమ్మంగి అటవీశాఖ అధికారి ఎం.అబ్బాయి దొర అన్నారు. అటవీ సంరక్షణ వారోత్సవాల్లో బుధవారం భాగంగా అటవీ శాఖ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అడవులను సంరక్షించాలని అడవి జంతువులను కాపాడుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం గాంధీ చిత్రపటానికి అటవీశాఖ సిబ్బంది పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ పి రాము, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బోడుగూడలో రచ్చబండ ప్రారంభం

రచ్చబండ ప్రారంభిస్తున్న సర్పంచ్ జ్యోతి

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ : అరకులోయ మండలం మాడగడ పంచాయతీ బోడుగూడ గ్రామంలో 15 ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన రచ్చబండను బుధవారం స్థానిక సర్పంచ్ మండ్యకెడ్డి జ్యోతి ప్రారంభించారు. మహాత్మగాంధీ జయంతి సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామసభలో సర్పంచ్ మండ్యకేడి జ్యోతి మాట్లాడుతూ రూ. 30 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో రక్షిత మంచినీటి పథకం, డ్రైనేజీ, సిసి రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో పచ్చదనం, పారిశుధ్యం పెంపొందించడంతోపాటు సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వాడకం నియంత్రణకు ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. వైస్ సర్పంచ్ కిల్లో గాసి, పంచాయతీ కార్యదర్శి రాజబాబు, చిట్టిబాబు, వార్డు సభ్యులు, గ్రామ సచివాలయం, వెలుగు సిబ్బంది, పెద్దలు పాల్గొన్నారు.

డొంకరాయి రిజర్వాయర్ వద్ద మొసళ్లు హల్‌చల్

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు కాంప్లెక్స్ పరిధి దిగువ సీలేరు డొంకరాయి రిజర్వాయర్ వద్ద మంగళవారం రాత్రి మూడు మొసళ్లు హల్ చల్ చేశాయి. రిజర్వాయర్ సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం... రిజర్వాయర్ పై నైట్ షిఫ్ట్‌లో హొంగార్డు ఎం. రమేష్, ఏపీ జెన్కో ఉద్యోగి రామ్ కిరణ్ మంగళవారం రాత్రి విధులు నిర్వహిస్తున్నారు. ఒరిస్సా నుంచి ఆటోలో డ్యాం పై నుంచి వస్తున్న యువకులు డ్యాం పైన మూడు మొసళ్లు సంచరిస్తున్నట్లు గమనించి విధుల్లో ఉన్న సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన సిబ్బంది సెక్యూరిటీ హొంగార్డ్ రమేష్ సెక్యూరిటీ ఇన్చార్జ్ శివరాముకి తెలియజేశారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మొసళ్ళు సంచరిస్తున్న ప్రదేశానికి వెళ్లే సరికి రెండు మొసళ్లు నదిలోకి వెళ్లిపోయాయి. ఒక మాత్రం నదిలోకి వెళ్లలేక డ్యాం పైన విధి నిర్వహణ చేపడుతున్న రూమ్‌కి సమీపంలో ఉండిపోయింది. దాన్ని చాకచక్యంగా తాళ్ల సహాయంతో సిబ్బంది డొంకరాయి రిజర్వాయర్‌లో విడిచిపెట్టారు. డొంకరాయి రిజర్వాయర్‌లో అధిక సంఖ్యలో మొసళ్లు సంచరిస్తున్నాయని సిబ్బంది తెలిపారు. నదిలో ఉండే మొసళ్లు డ్యామ్ పైకి రావడంతో సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

తాడు కట్టి మొసలిని రిజర్వాయర్‌లోకి పంపిస్తున్న దృశ్యం

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-దేవీపట్నం

గాంధీ జయంతి సందర్భంగా దేవీపట్నం మండలం ఇందుకూరుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద జనసేన ఆధ్వర్యంలో హాలోస్ హాస్పిటల్స్, మల్టీ స్పెషాలిటీస్, రాజమండ్రి గౌతమి నేత్రాలయం సహకారంతో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రజలు వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి జనసేన నాయకులు కార్పొరేట్ వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎమ్మెల్యే కూడా వైద్య, కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నేత విజయ్‌భాస్కర్, జనసేన నాయకులు కుర్లా రాజశేఖర్ రెడ్డి, జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

. ఇక నుంచి ప్రతి శుక్రవారమూ శ్రమదానం

ప్రజాశక్తి -పాడేరు : ఇక నుంచి ప్రతి శుక్రవారమూ కనీసం రెండుగంటల పాటు శ్రమదానం చేయాలని, తద్వారా కార్యాలయాలు, వాటి పరిశుభ్రం చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. బుధవారం స్వచ్ఛత హీ సేవ ముగింపులో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో వెనుక వైపు ఉన్న పొదలను, తుప్పలను, ప్లాస్టిక్ వ్యర్థాలను కలెక్టర్ స్వయంగా తొలగించారు. అనంతరం కలెక్టరేట్ ప్రహరీని పరిశీలించి కలెక్టరేటుకు వచ్చే సందర్శకుల వాహనాల పార్కింగుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు.కలెక్టరేట్ రహదారిని పరిశీలించి, త్వరలో సిసి రోడ్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెసి డాక్టర్ అభిషేక్ గౌడ్, డిఆర్ఓ బి పద్మావతి, డిపిఆర్ఓ గోవిందరాజులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

జిఒ 3ని పునరుద్ధరించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి- దేవీపట్నం

జిఒ నెంబరు 3ను పునర్ధరించాలని, లేదంటే షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాలను మన్యం ప్రాంత ఆదివాసీ గిరిజనులకు చెందే విధంగా చట్టం చేయాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవికి ఆదివాసీ జేఏసీ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోయిన అనాధగా ఉన్న తెల్లం నక్షత్రకు, లారీ ప్రమాదంలో రెండు కాళ్ళు చచ్చు బడిపోయిన బండారు దుర్గాప్రసాద్‌కు సిఎం రీలీఫ్ ఫండ్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే శిరీష దేవి పై సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు యలగాడ నాగేశ్వరావు, కారం రామన్న దొర, అరగంటి వీరభద్ర రెడ్డి, తెల్లం నక్షత్ర, బండారు వీరలక్ష్మి, నడిపూడి భాను శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

జాతిపితకు ఘన నివాళి

నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-యంత్రాంగం

పాడేరు : సత్యం, అహింస అస్త్రాలుగా దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో జాతిపిత మహాత్మాగాంధీ ప్రముఖ పాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ కొనియాడారు. బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ, దేశ రెండవ ప్రధాని లాల్ బహుదూర్‌శాస్త్రి జయంతిలను పురస్కరించుకుని కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో వారి చిత్రపటాలకు జిల్లా కలెక్టర్ పూలమాలువేసి, పుష్పాంజలి ఘటించారు.కార్యక్రమంలో డిఆర్ఓ బి పద్మావతి,కలెక్టరేట్లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిడిఎలో...

ఐటిడిఎ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ,మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు ఐటిడిఎ సహాయ ప్రాజెక్ట్ అధికారులు వివిఎస్ ప్రభాకరరావు, ఎం వెంకటేశ్వరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐటిడిఎ పరిపాలన అధికారి ఎం.హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: స్వచ్ఛతా అరకులోయ అందరి లక్ష్యమని టిడిపి అరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి సివేరి దొన్నుదొర అన్నారు.గాంధీ జయంతి సందర్భంగా బాపూజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.స్వచ్ఛభారత్ ప్రారంభించి పదేళ్ల పూర్తయిన సందర్భంగా పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు.కార్యక్రమంలో సిఐ ఎల్ హిమగిరి, మండల టిడిపి అధ్యక్షులు శెట్టి బాబురావు, ఎంపిటిసిలు దూరియా ఆనంద్, భీమరాజు, పద్మపురం మాజీ సర్పంచ్ మహాదేవ్, పంచాయతీ ఇఒ పాలక రాజకుమార్, వైస్ సర్పంచ్ విజయ నిర్మల, వార్డు సభ్యులు సోమరాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: స్థానికపంచాయతీ కేంద్రంలో సర్పంచ్ పి కొములు ఆధ్వర్యంలో గాంధీ జయంతిని నిర్వహించారు. పంచాయతీ వార్డు సభ్యులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనంతగిరి : కొత్తూరు గ్రామంలో గాంధీ చిత్ర పటానికి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. టిడిపి మండల అధ్యక్షులు ఆంటీపర్తి బుజ్జి బాబు, మండల ప్రధాన కార్యదర్శి ఆనందరావు, మాజీ జెడ్‌పిటిసి సాగర సుబ్బారావు, హుకుంపేట మండల జనసేన అధ్యక్షుడు కోటేశ్వరరావు పడాల్, కొత్తూరు సర్పంచ్ సీతయ్య వైస్ సర్పంచ్ నరేంద్ర పార్లమెంట్ కార్యదర్శి సుందరారావు క్లస్టర్ ఇంచార్జీ జోగులు యూనిట్ ఇంచార్జీ లు లక్ష్మణ్, హరి టిడిపి నాయకులు వీరమల్ల శివ, అప్పలస్వామి, తిరుపతి సన్నీ బాబు గన్నారావు నాగేశ్వర్రావు మహేష్ రవి దేముడు భీమ రాజు జగన్ శ్యామ్ సునీత లక్ష్మి రవీంద్ర ప్రసాద్ శాంతి రాజ్ పాల్గొన్నారు.

చింతపల్లి : చేయూత వారియర్స్ ట్రస్ట్ చైర్మన్ ధూనబోయిన రమణ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు టిడిపి నేత, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, ట్రస్టు సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఇమ్మంది మోదగిరి, అనిల్, కందా కృష్ణ పాల్గొన్నారు.

రంపచోడవరం : జాతిపిత మహాత్మా గాంధీ 155వ జయంతిని పురస్కరించుకొని స్థానిక ఐటిడిఏ సమావేశ మందిరంలో బుధవాచం ఆయన ఆయన చిత్రపటానికి ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడిచి ఏ సమస్యలైన శాంతియుతంగా పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ డిఎన్‌వి రమణ, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, పీహెచ్ఓ చిట్టిబాబు, ఎస్ఓ టి.మార్తమ్మ, గిరిజన సంక్షేమ కార్యాలయ సూపరింటెండెంట్ బి.కిషోర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చైతన్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సత్యనారాయణ, మహేశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో మహత్మ గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రత్న మాణిక్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, చింతూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చింతూరు బస్టాండ్ పరిసరాలలో పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాలను తొలగించి పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.సాయికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి ఎస్‌డబ్ల్యుపిసి కర్మాగారం వద్ద గాంధీజీ చిత్రం పటానికి జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, సర్పంచ్ పూనం సరోజిని, సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ, పంచాయతీ సెక్రటరీ శివ ప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పారిశుద్య కార్మికులకు సాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రకాష్ రావు, చంద్రశేఖర్, కార్యకర్తలు పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు : గూడెం కొత్తవీధి మండలం సీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి సర్పంచ్ దుర్జో, సిఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ వికాస్ కుమార్ పాండే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతం పారిశుధ్య కార్మికులకు దుస్సాలువాలతో సర్పంచ్, ఉప సర్పంచ్ కె.వల్లి ప్రసాద్ సన్మానించారు. పంచాయతీ కార్యాలయం నుంచి జెడ్‌పి హైస్కూల్ ఎదురుగా ఉన్న గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది కుసుమ, రేవతి, అనుష్క, విజయ, లోవకుమారి, నాయకులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని కొయ్యూరు గ్రామంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాకాడ బాలరాజు, ఉప సర్పంచ్ తోట విగ్నేష్, నాయకులు తోట దొరబాబు, మేడిబోయిన చక్రరావు, మేడిబొయిన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరంలో నివాళులర్పిస్తున్న ఐటిడిఎ పిఒ సింహాచలం

నేరాలు ఘోరాలు

బైక్ రైడర్లపై కేసు

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని బైక్ రైడ్ చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు నార్త్ జోన్ ట్రాఫిక్ సిఐ కాంతారావు తెలిపారు. నగరానికి చెందిన కొందరు, మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు యువకులు శ్రీరామ్ ప్రాపర్టీ రోడ్డులో వాహనాలను మితిమీరిన వేగంతో నడపటంతో పాటు పెద్దగా ధ్వని చేయడంతో స్థానికులు సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

మద్యం సీసాలతో ఒకరి అరెస్ట్

ప్రజాశక్తి -కొత్తకోట : ఎటువంటి అనుమతులు లేకుండా పాన్ షాప్‌లో మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి తొమ్మిది మద్యం క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు కొత్తకోట ఎస్ఐ ఎం. శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డులో పాన్ షాప్‌లో మద్యం అమ్ము తున్నట్లు సమాచారం రాగా పోలీస్ సిబ్బందితో వెళ్ళి దాడి చేయగా తొమ్మిది మద్యం క్వార్టర్ బాటిల్స్ దొరికాయన్నారు .దీనికి సంబంధించి షాప్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనధికారికంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేంద్రకారాగారంలో ఖైదీల సంక్షేమ దినోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని విశాఖ కేంద్రకారాగారంలో ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రటరీ వి.శేషమ్మ, కెజిహెచ్ పర్యవేక్షణాధికారి డాక్టర్ పి.శివానంద ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఖైదీలు తమ హక్కులతో పాటు బాధ్యతలను తెలుసుకోవాలన్నారు. కేంద్రకారాగారంలో పరివర్తన చెంది బయటకు వెళ్లి మంచి జీవితం గడపాలన్నారు. కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ మహాత్మ గాంధీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని వారి అడుగు జాడల్లో మెలగాలన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆశ్రమ వాసులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఉప పర్యవేక్షణాధికారి ఎన్.కమలాకర్, అధికారులు పాల్గొన్నారు.

ఖైదీలకు బహుమతులు అందజేస్తున్న ముఖ్యఅతిథులు

ఏకలవ్య పాఠశాలల భవనాలు ప్రారంభం

పెదబయలులో పాఠశాలను ప్రారంభిస్తున్న కలెక్టర్, జెడ్‌పి చైర్‌పర్సన్

ప్రజాశక్తి-యంత్రాంగం

పెదబయలు : మండలంలోని సీతగుంట పంచాయతీ లకేపుట్టు గ్రామంలో రూ.18 కోట్లతో నిర్మించిన ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలల నూతన భవనాన్ని ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ప్రారంభించారు. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ప్రధాని నరేంద్రమోడీ గిరిజన విద్యార్థులకు నిర్మించిన ఏకలవ్య పాఠశాలను వర్చువల్‌గా ప్రారంభించగా, ఇక్కడ కలెక్టర్, జెడ్‌పి చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ గిరిజన బాలబాలికలకు నాణ్యమైన సమగ్ర విద్యను అందించటానికి కేంద్ర ప్రభుత్వం ఏకలవ్య నోడల్ పాఠశాలలుప్రారంభించిందని, ఏజెన్సీ 11 మండలాల్లో వీటిని ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులు మాతృభాషలో పాటు హిందీ, ఇంగ్లీష్‌లపై పట్టుసాధించాలని, అపుడే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. స్థానిక సర్పంచి పి.మాధవరావు, ఎంపిటిసి కె, బొంజుబాబు. వైస్ ఎంపిపి కె రాజాబాబు కూడా కృష్ణారావు, పొంగి రాజారావు, ఎంపిడిఒ విఘ్నేష్, తహశీల్దార్ జి రంగారావు నోడల్ ప్రిన్సిపల్ మూర్తి, ఇఎంఆర్ఎస్ ముంచింగిపుట్టు ప్రిన్సిపల్ కేశవరావు, గంపరాయి సూరయ్య పాల్గొన్నారు

హుకుంపేట: మండలంలోని మొట్టుజోరు పంచాయతీ, నక్కలపుట్టులో 15 ఎకరాల్లో రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించిన ఏకలవ్య పాఠశాలల భవనాలను అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యతోనే భవిష్యత్తు ఉందని, గిరిజన విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు తల్లిదండ్రులు కూడా పిల్లల చదివిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి బి.వెంకటరమణ రాజు, హుకుంపేట ఎంపిటిసి రమా, ఎంపిపి రాజబాబు, మాజీ ప్రిన్సిపల్ ప్రభాకర్ , ప్రస్తుత ప్రిన్సిపల్ సంతోష్‌కుమార్ ఉజ్వల్, ఎంఇఒ చెల్లయ్య, టిడిపి సర్పంచ్ శశిభూషణ్, నాయకులు శెట్టి లక్ష్మణుడు, మండల అధ్యక్షులు తులసిరావు, సుబ్బారావు, సూర్యకాంతం పాల్గొన్నారు.

అనంతగిరి : మండలంలోని అనంతగిరి పంచాయతీ పాతకోట గ్రామంలో రూ.40 కోట్లు నిధులతో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాలను బుధవారం స్థానిక సర్పంచ్ సోమ్మెల రూతు ఆధ్వర్యాన జెడ్‌పిటిసి దీసరి, గంగరాజు ఎంపిపి శెట్టి నీలవేణి ప్రారంభించారుఈ సందర్భంగా జెడ్‌పిటిసి, ఎంపిటిసి సర్పంచ్‌లు మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణానికి పాతకోట గ్రామానికి చెందిన ఏడుగురు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 12ఎకరాల తమ జిరాయితీ భూమిని ఉచితంగా దానం చేశారన్నారు. స్థలదాతలకు పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తలితండ్రుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దాతలకు వేరేచోట భూమిని కేటాయించడంతో పాటు ఏకలవ్య పాఠశాలలో ఉద్యోగం, ఉపాధి కల్పించాలని కోరారు. దీనిపై కలెక్టర్, పిఒ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లి భరోసాగా ఉంటామన్నారు. కార్యక్రమంలో డుంబ్రిగుడ ప్రిన్సిపల్ సన్యాసినాయుడు, ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు ఎస్, నాగులు ఉప సర్పంచ్ పి.అర్జున్, వార్డు మెంబర్ జె. సుబ్బారావు, సిహెచ్ వెంకటరావు, రైతులు ఎన్.దోను,,గాసి ఏకలవ్య పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

అనంతగిరి మండలం పాతకోటలో ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు తదితరులు

సీలేరుకు వచ్చిన ఆర్‌టిసి బస్సు

సీలేరుకు ఆర్‌టిసి బస్సుల పునరుద్ధరణ

ప్రజాశక్తి -సీలేరు

ఎట్టకేలకు పాడేరు, నర్సీపట్నం డిపోల నుంచి సీలేరుకు బస్సు సర్వీసులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు పాడేరు డిపోకు చెందిన పాడేరు -డొంకరాయి ఎక్స్‌ప్రెస్ సర్వీస్ మంగళవారం నుంచి, నర్సీపట్నం డిపోకు చెందిన నర్సీపట్నం -సీలేరు పాసింజర్ సర్వీస్ బుధవారం నుండి పునరుద్ధరించారు. గత 8న కురిసిన భారీ వర్షాలకు కొండ చరియలు విరిడి జీకే వీధి మండలం లంకపాకల -సీలేరు మధ్య ప్రధాన రహదారిపైకి దూసుకొచ్చాయి. బండరాళ్లు, మట్టి రోడ్డుపై పేరుకుపోవడంతో ఈ మార్గంలో రవాణా పూర్తిగా నిలిచిపోయింది. కలెక్టర్ పిఓ ఆదేశాలు మీరు అధికారులు యుద్ధ ప్రాతిపదిగిన రహదారిపై ఉన్న మట్టి, బండరాళ్లు, చెట్లును యంత్రాలతో తొలగించి చిన్న వాహనాలు రాకపోకలకు తాత్కాలిక చర్యలు చేపట్టారు. అయితే రహదారికి ఇరువైపు గుంతల్లో వేసిన మట్టి బురదమయంగా మారడంతో ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపేందుకు ఇబ్బందిగా మారింది. సీలేరుకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి ఇబ్బందులకు గురయ్యారు. దీంతో సీలేరు వరకు బస్సులు నడపాలని అనేకసార్లు పలు పత్రికల్లో కథనాలు ప్రచురించిన నేపథ్యంలో అధికారులు బురదగా ఉన్న ప్రాంతాల్లో మెటల్, క్రషరుబుగ్గి వేసి రోలింగ్ చేయడంతో రహదారి కొంత మెరుగుపడింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు స్పందించి పాడేరు, నర్సీపట్నం డిపోకు చెందిన రెండు బస్సు సర్వీసులను పునరుద్ధరించారు. విశాఖపట్నం డిపోకు చెందిన విశాఖ నుండి సీలేరు మీదుగా భద్రాచలం పగటి పూట వెళ్లే బస్సును గురువారం నుంచి నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. రాత్రి సర్వీసును మాత్రం నడపడం లేదు.

విశాఖ నగరానికి స్వచ్ఛ భాగిదారి అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : రాష్ట్ర స్థాయిలో విశాఖ నగరానికి స్వచ్ఛ భాగిదారి అవార్డు దక్కింది. ఈ మేరకు అవార్డును రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ స్వీకరించారు. ఈ అవార్డును స్వీకరించడం ఆనందదాయకమని, విశాఖ నగర ప్రజలకు ఇది అంకితమని ఆయన అన్నారు. బుధవారం ఆయన మచిలీపట్నంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో విశాఖ నగరానికి ప్రథమ స్థానంగా వచ్చిన స్వచ్ఛ భాగిధారి అవార్డును అందుకున్న నేపథ్యంలో మీడియాతో మాట్లాడారు. నగర మేయర్, ప్రజా ప్రతినిధులు, నగర ప్రజలు, పారిశుధ్య కార్మికుల సేవల సహకారంతోనే ఈ స్వచ్ఛ భాగిధారి అవార్డు లభించిందని అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు విశాఖ నగరంలో 'స్వచ్ఛత స్వభావం - స్వచ్ఛత సంస్కారం' అనే నినాదంతో చేపట్టిన కార్యక్రమంలో పరిశుభ్రత పాటించడంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ స్వచ్ఛత కి భాగిదారీ, సంపూర్ణ స్వచ్ఛత, సఫాయిమిత్ర సురక్షా శిబిరాలను విరివిగా చేపట్టినట్టు తెలిపారు. ఇలా ప్రజలను భాగస్వామ్యం చేస్తూ పరిశుభ్రత, స్వచ్ఛత పట్ల అవగాహన కల్పించడంలో విశాఖ నగరానికి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం దక్కిందని తెలిపారు.

ఈ దేశం - నా దేశం పాట విడుదల

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సుదీప్ సాయి సారథ్యంలో రచించి, దర్శకత్వం వహించిన సబ్ కా మాలిక్ ఏక్ హై ఫిలింలోని ఈ దేశం - నా దేశం అనే పాటను జివిఎంసి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు విడుదల చేశారు. బుధవారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఉక్కు రక్షణకు ఉవ్వెత్తున దీక్షలు

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి
ప్రైవేటీకరణకు పూనుకుంటే తీవ్ర పరిణామాలు
కేంద్ర బిజెపిని హెచ్చరించిన నేతలు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఉవ్వెత్తున నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని బుధవారమూ నినాదాలు మిన్నంటాయి. ప్రైవేటీకరణకు పూనుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని నేతలు హెచ్చరించారు.

విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంతగనులు కేటాయించాలని, ప్రైవేటీకరణ విధానాలు మానుకోకపోతే తెలుగోడి సత్తా చూపుతామని కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కెఎస్.చలం హెచ్చరించారు. ఉక్కు రక్షణ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బుధవారం భారీ ఎత్తున నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను ప్రారంభిస్తూ లోకనాథం, సత్యనారాయణమూర్తి, చలం మాట్లాడారు. విశాఖ ఉక్కు - తెలుగోడి హక్కు నినాదంతో ప్లాంట్‌ను రక్షించుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా ఎదుర్కోవడానికి విశాఖ కార్మిక వర్గం, బిజెపియేతర రాజకీయ పార్టీలు, ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని చెప్పిన నాయకులు నేడు బిజెపి చర్యలను ఎందుకు అడ్డుకోలేకపోతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లడ్డూపై ఉన్న శ్రద్ధ ప్రజల ఆస్తి, రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమ అయిన స్టీల్‌ప్లాంట్‌పై ఎందుకులేదని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ భూములను కాజేయడం కోసం మోడీ ప్రభుత్వం ప్రైవేట్‌జపం చేస్తుంటే రాష్ట్రంలో ప్లాంట్‌ను కాపాడాల్సిన ప్రాంతీయ పార్టీలు నోరుమెదపకుండా చాపకింద నీరులా సహకరించడం తగదన్నారు. నాలుగేళ్లుగా ప్లాంట్ రక్షణ కోసం విశాఖ కార్మిక, ప్రజా సంఘాలు ఉద్యమించి ప్రైవేటీకరణ చర్యలు అడ్డుకున్నాయి తప్ప ఏ ఒక్క ప్రధాన రాజకీయ పార్టీ అడ్డుకోలేకపోయిందని తెలిపారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ ఛైర్మన్ భోగవిల్లి నాగభూషణం, ఎం.మన్మథరావు మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి శతవిధాలా ప్రయత్నాలు కొనసాగిస్తోందన్నారు. ఐక్య పోరాటాలతో ఆ కుట్రలను అడ్డుకోగలుగుతున్నామన్నారు. గురువారం మహిళా సంఘాలు చేపట్టిన ఉక్కు దీక్షలో మహిళలు అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, సిఐఎఫ్‌టియు జాతీయ కార్యదర్శి ఎన్.కనకారావు, ఎఐసిటియు జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, ఎపిఎఫ్‌టియు నాయకులు కె.దేవా, ప్రజా సంఘాల నాయకులు ఎం.సుబ్బారావు, సత్యన్నారాయణ, ఆర్.లక్ష్మణమూర్తి, పడాల రమణ, బి.జగన్, జెడి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : గాంధీ జయంతి సందర్భంగా చేపట్టిన విశాఖ ఉక్కు సత్యాగ్రహ దీక్షలు విజయవంతమయ్యాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1329వ రోజుకు చేరుకున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఉక్కు సత్యాగ్రహ దీక్షకు దిగారు. బుధవారం ఉదయం నుంచి సాయంకాలం వరకు జరిగిన దీక్షకు పోరాట కమిటీ నాయకులతో పాటు వివిధ కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. దీక్షలనుద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో- కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి యాజమాన్యం ప్రయత్నిస్తోందని, దానిలో భాగంగానే 4000 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడానికి యాజమాన్యం ప్రయత్నం చేస్తోందని, దీనిని తిప్పికొడతామని చెప్పారు. రూ.లక్షల కోట్ల విలువైన స్టీల్ ప్లాంట్‌ను తక్కువ ధరకు అంబానీ వంటి ప్రయివేటు వ్యక్తులకు అమ్మేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వకపోగా సంస్థను నిర్వీర్యం చేయడానికి గట్టిగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సెయిల్‌లో విలీనం చేయటానికి అని ప్రయత్నాలు చేస్తున్నామని చెబుతున్న యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు ఎందుకు పూనుకుందని ప్రశ్నించారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, కార్మిక సంఘాలతో చర్చించకుండా ఏకపక్ష నిర్ణయాలను తీసుకుంటున్న యాజమాన్యం తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కూర్మన్నపాలెంలో జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు జాతీయ రహదారిని దిగ్బంధనం చేశారు.

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు లోకనాథం

అనకాపల్లి : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు బాలేపల్లి వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను నేడు మోడీ ప్రభుత్వం దశలవారీగా ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. విశాఖ ఉక్కు ఆస్తులను అప్పనంగా కొట్టేయాలని కేంద్ర బిజెపి, రాష్ట్ర టిడిపి కూటమి ప్రభుత్వాలు పన్నాగం పన్నుతున్నాయని విమర్శించారు. తిరుమల లడ్డూ చుట్టూ రాజకీయాలను తిప్పి ప్రజా సమస్యలను, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయాలను మరుగున పెడే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా టిడిపి కూటమి స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట వేదిక జిల్లా కన్వీనర్ రుత్తల శంకర్రావు, కో కన్వీనర్ ఆర్. దొరబాబు, సిఐటియు నేతలు గనిశెట్టి సత్యనారాయణ, వీవీ శ్రీనివాసరావు, ఆర్ దేముడు, నాగిరెడ్డి సత్యనారాయణ, ఏఐటీయూసీ నాయకులు పి.సత్యనారాయణ, ఏసుదాసు, అప్పలరాజు, ఐఎఫ్టియు నాయకులు రాంబాబు పాల్గొన్నారు. ఈ దీక్షలకు ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, నాయకులు పరమేశ్వరి, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు బాలు గాడి, లాయర్ సురేష మద్దతు తెలియజేశారు.

విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉత్తరాంధ్ర ప్రజారక్షణ కన్వీనర్ వివి.రమణమూర్తి నాయకత్వంలో బుధవారం నగరంలో వందలాది మందితో మహా ర్యాలీ నిర్వహించారు. ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం నుంచి గురజాడ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆశీలు మెట్ట జంక్షన్ మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. ర్యాలీ అగ్రభాగంలో పలు సాంస్కృతిక సంస్థలు విప్లవ గీతాలను ఆలపించాయి.

ఫెస్ట్‌కు బయలుదేరిన విద్యార్థులు

కల్చరల్ ఫెస్ట్‌కు ఏకలవ్య విద్యార్థులు

ప్రజాశక్తి-కొయ్యూరు : అరకులోయలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈనెల 3వ తేదీన జరుగు రాష్ట్ర స్థాయి మోడల్ ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్ 5వ కల్చరల్ ఫెస్ట్ 2024-25 కార్యక్రమానికి కొయ్యూరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు బుధవారం బయలుదేరి వెళ్లారు. పాఠశాల నుంచి 16 మంది బాలికలు, 12 మంది బాలురు మొత్తం 28 మంది విద్యార్థులు వెళ్లినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థుల పర్యవేక్షణకు శ్యామ్ కుమార్, తమ్మారావు, కొండతల్లి ముగ్గురు ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు.

రేపు నాలుగు మండలాల్లో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : జాతీయ రహదారి విస్తరణ పనులు, లైన్లకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలు నరుకుతున్న కారణంగా ఈ నెల 4న శుక్రవారం గంగవరం, వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.దివాకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, విద్యుత్ వినియోగదారులు దీనికి సహకరించాలని కోరారు.

ఘనంగా షిర్డీసాయి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-సీలేరు : జికె వీధి మండలం సీలేరులో షిర్డీసాయిబాబా వార్షిక జయంతి వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. గత నెల 28 నుంచి ప్రారంభమైన ఈ వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఈ నేపథ్యంలో షిర్డీ సాయి సన్నిధిలో భక్తుల ఆర్థిక సహాయంతో బుధవారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి-చింతూరు : మావోయిస్టు పార్టీ వారోత్సవాలకు వ్యతిరేకంగా చింతూరు సంతలో బుధవారం ఆదివాసీ యువత ర్యాలీ నిర్వహించారు. చింతూరు ప్రధాన సెంటర్ నుండి సంత ప్రాంగణం మీదుగా బ్రిడ్జ్ వరకు సాగిన ఈ ర్యాలీలో ప్లకార్డులు పట్టుకొని మావోయిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గిరిజనులకు ఉపయోగపడని మావోయిస్టు వారోత్సవాలు మాకొద్దంటూ నినదించారు.

ఒపిఎస్‌కు పోరాటాలే మార్గం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత పెన్షన్ విధానానికి మరొకటి ప్రత్యామ్నాయం లేదని, దానికోసం పోరాటం తప్ప మరొక మార్గం లేదని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం విశాఖ రక్షణ రంగ కార్మికులు పాత పెన్షన్ విధానం సాధించేంత వరకు పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కుమార్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ స్కీము పేరుతో కార్మికులను దగా చేస్తోందని, దీనిని ఎవరూ పాత పెన్షన్ కంటే మంచిదని అనుకోవడం లేదని తెలిపారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పోరాడుతున్నారని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై రోజుకొక మాట మాట్లాడుతున్నారని, లాభాలలో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని, వీటికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పాత పెన్షన్ కోసం జరిగే పోరాటంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి నడుస్తామనిఏపీ ఎన్జీవోస్ విశాఖ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్ అన్నారు.